ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
గురువారం 30 జనవరి 2025



నిర్లక్ష్యం చేస్తే శాశ్వత అంగవైకల్యం 6
- నేడు కుష్టు నివారణ దినం

చివరి దశకు వంతెనల నిర్మాణం 8
- పూర్తి కావస్తున్న హన్మాజిపేట బ్రిడ్జి పనులు
- తీరనున్న ప్రజల కష్టాలు..

న్యూస్ బాక్స్

సీఎం దిష్టిబొమ్మ దహనం

ఇల్లంతకుంట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశాడంటూ బీజేపీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. మండల కేంద్రంలోని బస్టాండ్‌ప్రాంతంలో బుధవారం మండలశాఖ అధ్యక్షుడు భూమల్ల అనీల్ కుమార్ ఆధ్వర్యం నిరసన వ్యక్తం చేశారు. బత్తిని సాయగౌడ్, మాజీ సర్పంచ్‌లు చింతలపెల్లి తిరుపతిరెడ్డిచ కాచం శ్రీనివాస్ రెడ్డి, నాయకులు మేకల మల్లేశం, మామిడి హరీష్, బత్తిని స్వామి, చిమ్మనగొట్టు శ్రీనివాస్, పిల్లి గోపాల్, దూది సుధీర్‌రెడ్డి, గైని శ్రీనివాస్, అఖిల్, రాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం

ఇల్లంతకుంట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దలింగాపూర్ సదర్ చెరువుకు రంగనాయక సాగర్ నీరు చేరడంతో కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. రెండు రోజుల క్రితం రంగనాయకసాగర్ ద్వారా నీటిని విడుదల చేయగా బుధవారం చెరువుకు చేరింది. ఈసందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే సత్యనారాయణలకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ అధికారప్రతినిధి పసుల వెంకటి, మాజీ ఎంపీటీసీ కరివెద స్వప్నకర్ణాకర్‌రెడ్డి, నాయకులు మాతిరెడ్డి నవీన్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, బొప్ప సత్యం, వాడె కిషన్‌రెడ్డి, గుర్రాల రంజిత్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

రోడ్లపై కోతులకు ఆహారం అందిస్తే కేసులు : ఎఫ్ఎస్‌వో

ఎల్లారెడ్డిపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల శివారుల్లోని రహదారులపై కోతులకు ఆహారం అందించడం వల్ల ప్రమాదవశాత్తు మూగజీవాలు మృత్యువాతకు కారణమైన వ్యక్తులపై అటవీశాఖ చట్టం కింద కేసులు నమోదు చేస్తామని ఎఫ్ఎస్‌వో సకారాం హెచ్చరించారు. ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలో బుధవారం ఆయన మాట్లాడుతూ వనాలను వీడి జనాల్లోకి చేరుతున్న వానరాలకు పలుగ్రామాల్లోని రోడ్లపై పండ్లు, ఇతర తినుబండారాలను వేయడంతో కోతులు అక్కడే ఉండిపోతున్నాయన్నారు.రహదారుల వెంటవేయడం వల్ల వానరాలతోపాటు వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. రోడ్లపై కాకుండా పక్కన వేయాలని సూచించారు. కోతుల మృత్యువాత, ప్రమాదాలకు కారణకులైన వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు.



సిరిసిల్లలో గంగమ్మ తల్లి పల్లకీసేవ



సిరిసిల్ల గంగమ్మ జాతరలో స్వామివారిని దర్శించుకుంటున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

మామిడిపల్లిలో భక్తులతో కిటకిటలాడుతున్న శ్రీ సీతారాముల స్వామి ఆలయం

- జిల్లాలో 'మాఘ అమావాస్య జాతర' కోలాహలం
- సిరిసిల్ల మానేరు తీరంలో పోటెత్తిన భక్తులు
- స్వామివారిని దర్శించుకున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, వివిధ పార్టీల నాయకులు

భక్తి తన్మయత్వంలో..

సిరిసిల్ల మానేరు, మూలవాగుల తీరప్రాంతాలు మాఘ అమావాస్య జాతరలతో సందడిగా మారాయి. సంప్రదాయాల పరంపరకు అద్దం పడుతూ బుధవారం జిల్లా వ్యాప్తంగా జాతరలకు భక్తులు పోటెత్తారు. సంక్రాంతి పండుగ ముగిసిన వెంటనే శివరాత్రి వరకు జాతరలు సాగుతాయి. జాతరలకు జనం తరలి వెళ్లి భక్తిశ్రద్ధలతో ఆయా దేవాలయాల్లో పూజలు చేస్తారు. జిల్లాలో సాగిన మాఘ అమావాస్య జాతరలకు బొమ్మల దుకాణాలతో సందడిగా మారింది. సిరిసిల్ల మానేరు తీరంలో బొమ్మల దుకాణాలు జాతరకు ప్రత్యేక శోభను తెచ్చింది. జిల్లాలోని మానేరు, మూలవాగు తీరాల్లో దేవతా మూర్తుల కల్యాణాలు, ప్రత్యేక కార్యక్రమాలతో సాగిన జాతరల్లో భక్తులు తన్మయత్వంతో పాల్గొన్నారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని మూడు జాతరలు ముచ్చటగా సాగాయి. సిరిసిల్ల మానేరు వాగులో గంగభవాని జాతర, మడలేశ్వరస్వామి జాతర, మిడ్‌మానేరు కరకట్ట వద్ద రామప్ప రామలింగేశ్వరస్వామి జాతరలు సాగాయి. మూడు దేవాలయాల్లో స్వామివారి కల్యాణాలను వైభవంగా నిర్వహించారు. మానేరు తీరంలో గంగమ్మ దేవస్థానం వద్ద గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవం నిర్వహించారు. మహిళలు అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించుకున్నారు. రజక సంఘం ఆధ్వర్యంలో శ్రీమడలేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారి కల్యాణం, నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కరకట్ట వద్ద రామప్ప రామలింగేశ్వర స్వామి కల్యాణాలు ఘనంగా నిర్వహించారు. సిరిసిల్ల జాతరలు, కల్యాణోత్సవంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, గ్రంథాలయసంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వెల్మల స్వరూపరెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ప్రకాష్, కాంగ్రెస్ మహిళ జిల్లా అధ్యక్షురాలు కామిని వనిత, కాంగ్రెస్ నాయకులు సంగీతం శ్రీనివాస్, గడ్డం నర్సయ్య, అడెపు చంద్రకళలు స్వామి వారిని దర్శించుకున్నారు. టెక్స్‌టైల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్లు జిందం కళచక్రపాణి, సామల పావని, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, రజక సంఘం గౌరవ అధ్యక్షుడు అక్కరాజు శ్రీనివాస్, తదితరులు స్వామివారల ను దర్శించుకున్నారు.



సిరిసిల్లలో శ్రీ మడలేశ్వర స్వామి పల్లకీసేవ

ఊరురా జాతరలు...

ఎల్లారెడ్డిపేట : మండల కేంద్రంతో పాటు అక్కపల్లి, గొల్లపల్లి, బొప్పాపూర్, కోరుట్లపేట, వెంకటాపూర్ తదితర గ్రామాల్లో బుధవారం మాఘ అమావాస్య వేడుకలు జరిగాయి. అక్కపల్లి గ్రామ శివారులోని శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, కోనరావుపేట, సిరిసిల్ల, ముస్తాబాద్, సిరికొండ, తదితర మండలాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. రామలింగేశ్వరస్వామి, హనుమాన్, మల్లన్న ఆలయాల్లో పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీకేశవ పెరుమాండ్ల ఆంజనేయ స్వామి ఆలయంలో అభిషేకం తదితర పూజలను నిర్వహించారు. స్వామి కల్యాణ వేడుకలను జరిపించారు. వైద్యుడు సత్యనారాయణ స్వామి ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. గొల్లపల్లిలోని గాలం గుట్ట ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన పాతూరి పుష్పలత-మల్లారెడ్డి దంపతుల కొడుకు నర్సింహారెడ్డి-లావణ్య ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కోరుట్లపేట, వెంకటాపూర్‌లోని గంగమ్మ, ఆంజనేయస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం, మిగతా 8లో

కోడ్ కూసింది...

- ఫిబ్రవరి 27న ఎమ్మెల్సీ ఎన్నికలు

సిరిసిల్ల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మెదక్, నిజమాబాద్, అదిలాబాద్, కరీంనగర్ గ్రాడ్యుయేట్స్, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల నగారా మోగింది. బుధవారం నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఫిబ్రవరి 3న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ జారీ అవుతుంది. ఫిబ్రవరి 27న పోలింగ్, మార్చి 3న ఓట్ల లెక్కింపు జరగనుంది. మెదక్, నిజామాబాద్, అదిలాబాద్, కరీంనగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా టి జీవన్‌రెడ్డి, టీచర్ ఎమ్మెల్సీగా అలుగుబెల్లి నర్సిరెడ్డిల పదవీకాలం మార్చి 29న ముగియనున్న నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ జారీఅయ్యింది. ఇందుకు సంబంధిచి ఇప్పటికే ఎన్నికల ఏర్పాట్లు పూర్తి చేశారు. ఓటరు జాబితాను సిద్ధం చేశారు.

విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం : ఎస్ఎఫ్ఐ

ఇల్లంతకుంట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మంద అనీల్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని రహీంఖాన్‌పేట ఆదర్శ పాఠశాలలో బుధవారం మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం విద్యను పట్టించుకోవడం లేదని విమర్శించారు. విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న ఎస్ఎఫ్ఐ అండగా విద్యార్థులు నిలుస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో మండల అధ్యక్షుడు బండారి చందు, కార్యదర్శి దేవరకొండ అజయ్, ఉపాధ్యక్షులు బట్టి హరికృష్ణ, పున్ని పవన్, శివప్రసాద్, కళాశాల గర్ల్స్ కన్వీనర్ అఖిల, కోకన్వీనర్ హంసలేఖ, కీర్తన, విష్ణుప్రియ, జెట్టి వేణు, గుంటి రాజు, దొమ్మాటి శ్రీహరి, రాజు, పవన్ పాల్గొన్నారు.

బీసీ యువజన సంఘాల బలోపేతానికి కృషి

ఎల్లారెడ్డిపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): అన్నిగ్రామాల్లో జాతీయ బీసీ యువజన సంఘాలను బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నామని సంఘం జాతీయ కార్యదర్శి అమరగొండ అజయ్ అన్నారు. మండలంలోని అన్ని గ్రామాల కమిటీలను బుధవారం ఆయన నియమించారు. ఈసందర్భంగా అజయ్ మాట్లాడుతూ బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పరిష్కారానికి పాటుపడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వినోద్, మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, గౌరవాధ్యక్షుడు శివ, ప్రధాన కార్యదర్శి నాగరాజు, సహాయకార్యదర్శి బాలరాజు, రాజు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా 'చేనేత అభయ హస్తం'..

- చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు - హైదరాబాద్‌లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి సమీక్ష

సిరిసిల్ల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): చేనేత అభయ హస్తం పథకాన్ని ప్రణాళికాబద్ధంగా అమలుచేయాలని చేనేత జౌళి, వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆదేశించారు. గురువారం హైదరాబాద్ సచివాలయంలో వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత అభయహస్తం పథకం ప్రణాళికాబద్ధంగా, త్వరగా అమలుచేయడానికి నేత కార్మికులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటుచేయాలన్నారు. రాష్ట్రంలోని మరమగ్గాల యూనిట్లకు 25 హెచ్‌పీల వరకు 50 శాతం విద్యుత్ సబ్సిడీ అమలుచేయాలని, యారన్ డిపో ద్వారా ఆసాములకు మాత్రమే నూలు పంపిణీ చేయాలని ఆదేశించారు. ఆసాములకు నూలుకు అవసరమయ్యే పెట్టుబడిని బ్యాంక్‌ల ద్వారా అందించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆసాములు ఇతరుల మీద ఆధారపడ కుండా స్వయంగా నూలు కొనుగోలు చేసుకోవడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. యారన్ డిపోలో నూలు కొరత లేకుండా చూడాలన్నారు. ఇప్పటివరకు ఏయే శాఖల నుంచి కావాల్సిన వస్త్రఉత్పత్తి ఆర్డర్లు సమర్పించని శాఖలపై చర్యలు తీసుకోవాలన్నారు. చేనేత సహకార సంఘాలు, పవర్‌లూం సంఘాలకు చెల్లించాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘం వినియోగదారులకు మెరుగైన సేవలందించాలని, రైతులకు పవర్‌లూం పరిశ్రమకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని ఆదేశించారు. అదనంగా ట్రాన్స్‌ఫార్మర్లను అందుబాటులో ఉంచుకొని సమస్య వస్తే ట్రాన్స్‌ఫార్మర్ మార్చి విద్యుత్ అంతరాయం లేకుండా చూసుకోవాలన్నారు. ఎలాంటి అవకతవకలు జరగకుండా విద్యుత్ రెగ్యులరేటరీ నిబంధనల ప్రకారం సంస్థను నడపాలన్నారు. సంస్థ సిబ్బంది ప్రజాప్రతినిధులను కలుపుకొని వినియోగదారులకు మెరుగైన సేవలందించాలని సూచించారు. ఇదే సందర్భంలో కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, పవర్‌లూం, వస్త్ర పరిశ్రమ సెస్ సమస్యలపై మంత్రికి వినతిపత్రం అందించారు. సమావేశంలో చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి శైలజరామయ్యార్, వ్యవసాయ కార్యదర్శి రఘునందన్‌రావు, సహకార డైరెక్టర్ ఉదయ్‌కుమార్,ఉద్యానవన డైరెక్టర్ యాస్మిన్‌భాషా తదితరులు పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, చిత్రంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

మున్సిపల్ విధులను పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా - సిరిసిల్ల మున్సిపాలిటీ పనితీరుపై సమీక్ష

సిరిసిల్ల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీల్లో ప్రతి ఒక్క అధికారి తన విధులను పకడ్బందీగా నిర్వహించాలని, సిబ్బందికి అనుమతి లేకుండా సెలవులు మంజూరు చేయవద్దని కలెక్టర్, మున్సిపల్ ప్రత్యేక అధికారి సందీప్ కుమార్ ఝా అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో సిరిసిల్ల మున్సిపల్ పనితీరుపై వివిధ విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న సిబ్బంది, అధికారుల వివరాలు నిర్వహిస్తున్న విధులను తెలుసుకున్నారు. పారిశుధ్య నిర్వహణ, ఇంటింటి నుంచి చెత్త సేకరణ, చెత్తబుట్టల పంపిణీ, వాహనాల వివరాలు, వర్కింగ్, నాన్‌వర్కింగ్ ట్రేడ్ లైసెన్సులు, బిల్డింగ్ అనుమతులు, ఆస్తి పన్నులు, వాటర్ ట్యాంక్, వర్మీ కంపోస్ట్ ఎస్టీపీ ట్యాంక్ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. సిరిసిల్లలో పారిశుధ్య నిర్వహణ మరింత మెరుగ్గా అమలు చేయాలని, ప్రతి రోజు ఉదయం పారిశుధ్య సిబ్బంది హాజరు పక్కాగా నమోదు చేయాలని ప్రతిరోజు చెత్త సేకరణ పకడ్బందీగా చేయాలని అన్నారు. మున్సిపల్ వాహనాలకు ప్రభుత్వ పెట్రోల్ బంక్‌లో మాత్రమే డీజిల్ వాడాలని తెలిపారు. వాహనాలకు జీపీఎస్ ట్రాకర్ ఏర్పాటు చేయాలని, ప్రతిరోజు వాహనాల మూవ్‌మెంట్‌ను చూడాలని అన్నారు. ట్రేడ్ లైసెన్స్‌లు, రెన్యూవల్ వసూళ్ల ఫీజు పునఃపరిశీలించాలని, ప్రతి వ్యాపారి నుంచి ట్రేడ్ లైసెన్స్ ఫీజులు వసూలు చేయాలని ఆదేశించారు. లక్ష్యం మేరకు వంద శాతం అస్థిపన్ను పూర్తి స్థాయిలో వసూలు చేయాలని అన్నారు. భవన నిర్మాణాల అనుమతులు, లే అవుట్ అనుమతులు నిబంధనల ప్రకారం జారీ చేయాలని అన్నారు. పట్టణంలో మొక్కలపెంపకం, తాగునీటి సరఫరా గురించి తెలుసుకున్నారు. పిచ్చి మొక్కలను బ్లేడ్‌యంత్రాలతో తొలగిస్తూ శుభ్రం చేయాలని అన్నారు. మున్సిపాటీల్లో టీయూ ఎఫ్ఐడీసీ ద్వారా చేపట్టిన అభివృద్ధి పనుల స్థితిగతులు తెలుసుకోవాలని, ప్రాధాన్యత క్రమంలో పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకరావాలని అన్నారు. అక్రమ నిర్మాణాల తొలగింపు చర్యలు తీసుకోవాలని, అనుమతులు లేని నిర్మాణాలకు ఆస్కారం ఇవ్వవద్దని అన్నారు. చెరువులు ఆక్రమణకు గురికాకుండా చూడాలని అన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ లావణ్య, ఇతర మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

అందుబాటులో 20 రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు

ఎల్లారెడ్డిపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో 20 రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సీహెచ్‌సీ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ప్రదీప్ ఓ ప్రకటనలో తెలిపారు. 18 రకాల పరీక్షలు గంట వ్యవధిలో ఇవ్వడం జరుగుతోందని పేర్కొన్నారు. ఈనెల 28న సాయంత్రం సాంకేతిక లోపాన్ని సరిచేసి వ్యాధి నిర్ధారణ పరీక్షలను కొనసాగిస్తున్నారన్నారు. ఉమ్మడి ఎల్లారెడ్డిపేట మండలంలోని ప్రజలు వినియోగించుకోవాలని ఇన్‌చార్జి సూపరిండెంట్ ప్రదీప్ కోరారు.

సిరిసిల్ల పట్టణంలోనే కార్యాలయాన్ని కొనసాగించాలి

- సీఐటీయూ తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్



సమావేశంలో మాట్లాడుతున్న మూషం రమేష్

సిరిసిల్ల రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : చేనేత జౌళి శాఖ కార్యాలయాన్ని నేతన్నలకు అందుబాటులో ఉండేలా సిరిసిల్ల పట్టణంలోనే కొనసాగించాలని సీఐటీయూ తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని క్రామోడ్ అమృత్‌లాల్ శుక్లా కార్మిక భవనంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ సిరిసిల్ల పట్టణంలోని కార్మిక క్షేత్రమైన బీవైనగర్‌లో చాలా సంవత్సరాల నుంచి చేనేత జౌళి శాఖ కార్యాలయాన్ని ఏర్పాటు చేసి నేతన్నలకు సేవలను అందిస్తుందన్నారు. ఈ కార్యాలయాన్ని జిల్లా సమీకృత కలెక్టరేట్‌కు సమార్చడం సరైన విధానం కాదని మండిపడ్డారు. ఈ నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకుని సిరిసిల్ల బీవైనగర్‌లోనే చేనేత జౌళిశాఖ కార్యాలయాన్ని యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. పవర్‌లూం, అనుబంధ రంగాల కార్మికులకు, చేనేత కార్మికులకు ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న వివిధ పథకాల కోసం కూలీ కోసం తరచుగా కార్మికులు చేనేత జౌళిశాఖ కార్యాలయాన్ని వెళ్లివలసి ఉంటుందని అన్నారు. కార్మికులందరికి అందుబాటులో ఉన్న కార్యాలయాన్ని కలెక్టరేట్‌కు మార్చడం వలన జిల్లా కలెక్టరేట్ పట్టణానికి దూరంగా ఉండడంతో కార్మికులు ఇబ్బందులు పడే ప్రమాదం ఉందన్నారు. చేనేత జౌళి శాఖ కార్యాలయాన్ని పట్టణానికి దూరంగా ఉన్న కలెక్టరేట్‌కు తరలించడం సరైందని కాదని ప్రస్తుతం ఉన్న కార్యాలయంలోనే కొనసాగించాలని లేకుంటే కార్మికులతో పెద్ద ఎత్తున అందోళన కార్యక్రమాలను చేపట్టి పోరాటాలను నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, నాయకులు నక్క దేవదాస్, సిరిమల్ల సత్యం, బింగి సంపత్, గడ్డం రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య

బెల్లంపల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రేమ విఫలమై యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణంలోని అంబేద్కర్ రడగంబాల బస్తీలో బుధవారం జరిగింది. టూ టౌన్ ఎస్ఐ మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కనుకుల గ్రామానికి చెందిన చింతలవివేక్(21) చిన్నతనంలోనే తండ్రి మృతి చెందగా తల్లి రాజేశ్వరితో కలిసి బెల్లంపల్లి పట్టణంలోని అంబేద్కర్ రడగంబాల బస్తీలో ఉంటున్నాడు. పదో తరగతి వరకు చదివిన వివేక్ మంచిర్యాల పట్టణంలోని ఓబట్టల దుకాణంలో పనిచేసేవాడు. ఇటీవల స్థానికంగా ఓయువతిని ప్రేమించాడు. ఆమె ఒప్పుకోకపోవడంతో బాధపడుతూ దిగాలుగా ఉంటున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి తల్లి, అమ్మమ్మతో కలిసి టీవీ చూస్తూ పడుకున్నాడు. బుధవారం ఉదయం ఏడు గంటలకు వివేక్‌ను లేపుదామని వెళ్లగా రేకుల షెడ్డు పైకప్పుకు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఓసీపీ-2 కార్మికుడి..

రామగిరి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసీపీ-2లో జనరల్ మజ్దూర్‌గా పనిచేసే దాయక శ్రీనివాస్ (52) ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఓసిపి-2 స్టోర్స్‌లో పని చేసే శ్రీనివాస్ ఆరు నెలలుగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. చికిత్సపొందినా ఫలితం లేకపోవడంతో మనస్తాపానికి గురై బుధవారం ఉదయం సెంటినరీకాలనీలోని ఎస్‌టిటూ 551నెంబరు క్వార్టర్ ఎదుట ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్ళు ఉన్నారు.

చెరువులో వృద్ధురాలి మృతదేహం లభ్యం

కోరుట్ల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోహన్‌రావుపేట గ్రామంలోని చెరువులో వృద్ధురాలి మృతదేహం లభ్యమైంది. మృతురాలి పుర్రెను కుక్కలు పీక్కుని వ్యవసాయ క్షేత్రంలో పడేయడంతో బుధవారం ఘటన వెలుగు చూసింది. సంఘటన స్థలంను కోరుట్ల సీఐ సురేష్‌బాబు తన సిబ్బందితో పరిశీలించి గ్రామస్థుల సహకారంతో మోహన్‌రావుపేట గ్రామానికి చెందిన వృద్ధురాలుగా గుర్తించారు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కుంట లింగవ్వ (87) మతిస్థిమితం సరిగా లేక ఈ నెల 2వ తేదీన ఇంట్లో నుంచి వెళ్లింది. తల్లి అచూకీ లభించడం లేదని ఈ నెల 11వ తేదీన లింగవ్వ కుమారుడు రవి కోరుట్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కోరుట్ల పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. గ్రామంలోని చిలుక చెరువు ప్రాంతంలో ఓ వృద్ధురాలు తల ఉందని గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు చెరువులో వృద్ధురాలి మృతదేహం గుర్తించారు. పోస్టుమార్టం నిర్వహించి గ్రామస్థుల ఆధ్వర్యంలో ఖననం చేశారు. 26 రోజులుగా మృతదేహం చెరువులో ఉండ డంతో పూర్తిగా కుల్లిపోయి ఉంది. తల వేరయి ఒడ్డుకు చేరడంతో కుక్కలు ఎత్తుకువచ్చినట్లు పోలీసులు తెలిపారు.

108వాహనం ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు

మానకొండూర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : 108వాహనం ఢీకొని అసిస్టెంట్ లైన్‌మెన్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. మండలంలోని జగ్గయ్యపల్లి అసిస్టెంట్ లైన్‌మెన్ బి కిషన్ బుధవారం మండలంలోని అన్నారం గ్రామంలో విధులను నిర్వహించేందుకు మోటార్ సైకిల్‌పై వెల్లుతున్నాడు. అన్నారం నుంచి కరీంనగర్ వైపు వెలుతున్న 108 వాహనం స్థానిక హన్మాన్ ఆలయం మూలమలుపు వద్ద కిషన్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో కిషన్‌కు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌కి తరలించినట్లు విద్యుత్ సిబ్బందితెలిపారు.


తీవ్రంగా గాయపడ్డ కిషన్

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

శంకరపట్నం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కుక్క అడ్డు రావడంతో ద్విచక్రవాహనంపై వెళ్తున్న వ్యక్తి అదుపుతప్పి కిందపడి గాయాలైన సంఘటన మండలంలోని ఎరడపల్లి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. వీణవంక మండలం గంగారం గ్రామానికి చెందిన నరహరి ఇంద్రసేనారెడ్డి వ్యక్తిగత అవసరాల నిమిత్తం ఎరడపల్లి గ్రామానికి వచ్చి తిరిగి తన స్వగ్రామం వెళ్తున్నాడు. గ్రామశివారులో కుక్క అడ్డు రావడంతో ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. ఈప్రమాదంలో ఇంద్రసేనారెడ్డి కుడికాలు విరిగింది. గమనించిన స్థానికులు 108లో కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తులపై కేసు నమోదు

రామగిరి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వచర్ల గ్రామ పంచాయతీ పరిధిలోని పోచమ్మగుడి వద్ద గంజాయి అమ్ముతూ పట్టుబడిన ముగ్గురు వ్యక్తులపై కేసునమోదుచేశారు. గ్రామంలోని ఆలయం వద్ద గంజాయి అమ్ముతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ చంద్రకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేయగా సుల్తాన్‌బాద్‌కు చెందిన సుమంత్, పెద్దపల్లికి చెందిన పెంచాల సాయికృష్ణ, కల్వచర్లకు చెందిన చిప్పకుర్తి అజిత్ గంజాయి విక్రయిస్తున్నారు. పోలీసుల రాకను గమనించి అజిత్ పరారు కాగా సుమంత్, సాయికృష్ణలను అదుపులోకి తీసుకున్నారు. వారివద్ద 30గ్రాముల గంజాయి, బైకు, మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ చంద్రకుమార్ తెలిపారు.

విద్యుత్ కంచె బిగించిన వ్యక్తిపై కేసు

కథలాపూర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భూషణరావుపేట శివారులోని అడవుల్లో విద్యుత్ కంచె అమర్చి అడవి జంతువుల మృతికి కారకుడైన అపావత్ తిరుపతిపై కేసు నమోదు చేసినట్టు డిప్యూటీ రేంజ్‌అధికారి సురేశ్ తెలిపారు. బుధవారం సంఘటనా స్థలం పరిశీలించి వెటర్నరీ వైద్యులతో పంచనామా నిర్వహించారు. అనంతరం తిరుపతిని అదుపులోకి తీసుకుని మెట్‌పల్లి ఫారెస్ట్ రేంజ్ కార్యాలయంకు తరలించారు. అడవి జంతువులకు విద్యుత్ కంచెలు ఏర్పాటు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఈసందర్భంగా బీట్‌అధికారులు శివరాజ్, శ్రావణ్, సాయిరాం ఉన్నారు.

అదనపు వరకట్నం కోసం వేధింపులు.. కేసు నమోదు

జమ్మికుంట రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): అదనపు వరకట్నం కోసం తన భర్తనిత్యం వేధింపులకు గురిచేస్తున్నాడంటూ ఓ వివాహిత ఇచ్చిన పిర్యాదు మేరకు పోలీస్‌లు కేసునమోదుచేశారు. జమ్మికుంటకు చెందిన మాడుగుల సంధ్య, మండలంలోని మాచనపల్లికి చెందిన మాడుగుల కళ్యాణ్ చక్రవర్తికి 2014లో కట్న కానుకలు ఇచ్చి పెద్దలు ఘనంగా వివాహం జరిపించారు. కొన్ని సంవత్సరాలు వారి కాపురం సజావుగా సాగింది. వీరికి ఇద్దరు పిల్లలు జన్మించారు. కొంత కాలంగా అదనపు వరకట్నం తేవాలంటూ భర్త వేదింపులకు గురి చేస్తున్నాడని సంధ్య పేర్కొంది. ఈ మేరకు ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కళ్యాణ్ చక్రవర్తిపై అదనపు వరకట్నం కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు: బెల్లం పానకం ధ్వంసం

కోనరావుపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలంలోని పలుతండాల్లో ఎక్సైజ్‌అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. 400లీటర్ల బెల్లంపానకం ధ్వంసంచేసి, ఏడు లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. నిమ్మపల్లి దేవునితండా వట్టిమల్ల, బావుసాయిపేట, కమ్మరిపేట తండాల్లో గుడుంబాను తయారుచేస్తున్నారన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో బెల్లంతో చేసిన గుడుంబాను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇందుకు బాధ్యులైన ముగ్గురిపై కేసు నమోదుచేసి 8మందిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ అధికారులు ఎస్సైలు శైలజ, ప్రణీత్ సిబ్బంది పాల్గొన్నారు.

నిర్లక్ష్యం చేస్తే శాశ్వత అంగవైకల్యం

- 'కుష్టు'ను అరికట్టేందుకు లక్షణాలు గుర్తించి మందుల పంపిణీ
- నేడు కుష్టు నివారణ దినం
- వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు



(సుభాష్‌నగర్/సిరిసిల్ల, ఆంధ్రజ్యోతి)

కుష్టు.. ప్రాణాంతకమైన వ్యాధి కాదు.. అయినా నిర్లక్ష్యం చేస్తే శాశ్వత వైకల్యాన్ని కలిగించే మహమ్మారి. గతంతో పోల్చుకుంటే వ్యాధి తీవ్రత తగ్గిపోయినా.. ఇటీవల పెరుగుతున్నట్లు అంచనా వేసిన వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. జాతీయ ఆరోగ్య మిషన్ ప్రత్యేక సర్వేను చేస్తోంది. ప్రతి సంవత్సరం జనవరి 30న మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా కుష్టు వ్యాధి నివారణ దినోత్సవంగా జరుపుతున్నారు. జనవరి 30 నుంచి ఫిబవరి 13 వరకు పక్షోత్సవాలను నిర్వహిస్తూ ప్రజల్లో కుష్టు వ్యాధిపై అవగాహన కల్పిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కుష్టు వ్యాధి నిర్మూలనలో భాగంగా ప్రతి సంవత్సరం వైద్య ఆరోగ్య శాఖ సర్వేలు చేస్తున్నారు. అనుమానితులను గుర్తించి పరీక్షలు చేస్తున్నారు. కుష్టు వ్యాధి ప్రాణాంతకం కాకపోయినా అంగవైకల్యానికి దారి తీస్తుంది. ముందుగానే గుర్తిస్తే అంగవైకల్యం రాకుండా అరికట్టడం సులువు అవుతుందని భావిస్తున్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా వ్యాధిగ్రస్తులను గుర్తించే దిశగా ఇంటింటి సర్వేలు చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో 11 మందిలో కుష్టు వ్యాధిని నిర్ధారించి చికిత్సను అందిస్తున్నారు.శాశ్వత అంగవైకల్యానికి గురికాకుండా అవసరమైన వారికి హైదరాబాద్‌లో శస్త్రచికిత్సలు కూడా చేయిస్తున్నారు. శస్త్ర చికిత్సల అనంతరం వారికి పౌష్టికాహారం, ఇతర అవసరాలకు ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయం అందిస్తున్నారు. ప్రభుత్వ పరంగా ఫించన్లతో పాటు ఎంసీఆర్ చెప్పులు, మందుల కిట్లు అందిస్తున్నారు.

కారణాలు.. లక్షణాలు

కుష్టు వ్యాధి మైక్రో బాక్టీరియమ్‌లేప్రే బాక్టీరియా వల్ల వస్తుంది. ఒకరి నుంచి ఒకరికి అంటుకోదు. వ్యాధిక్రిములు శరీరంలోకి ప్రవేశించిన తరువాత రెండు నుంచి ఏడు రోజుల్లో వ్యాధి లక్షణాలు బయటపడుతాయి. ఈ వ్యాధి వల్ల చర్మం, మ్యూకస్ మెంబ్రేన్ నరాలు వ్యాధికి గురవుతాయి. రోగ నిరోధకశక్తిని బట్టి లక్షణాలు మారుతుంటాయి.

రోగి సరైన జాగ్రత్తలు తీసుకోకుండా ఉండడం వల్ల దుమ్ముధూళి, ఊపిరి ద్వారా లోపలికి చేరుకోవడం వల్ల రోగ నిరోధకశక్తి తగ్గుతుంది. జబ్బును చాలా ముందుగా తేలికగానే తెలుసుకోవచ్చు. రంగు తగ్గిన మచ్చలు, చుట్టూ ఉన్న చర్మంతో పోలిస్తే మచ్చలు పాలిపోయినట్లు ఉంటాయి. మచ్చలు గుండ్రటి ఆకారంలో ఉండి వేడి, నొప్పి, స్పర్శ తెలియదు. ప్రధానంగా స్పర్శ జ్ఞానం కనిపించదు. చర్మం మీద మచ్చలు ప్రాంతానికి వచ్చే నాడులు వాపు తేలడం, మోకాలి వెలుపల పక్కన, మోచేయి లోతట్టున, మెడలోను లావెక్కిన నాడులు తెలుస్తాయి. నాడులు వాచడం జరుగుతుంది. నొప్పి, దురద, పుండ్లు వచ్చి మానకపోవడం, మొఖం మీద చర్మం మందంగా తేలి ఉండడం, కనుబొమ్మలు వెంట్రుకలు రాలిపోవడం, పాదాలు, చేతులు శక్తిహీనమై వంకరలు తిరుగుతుంటాయి. తెల్లమచ్చలు ఉన్నచోట స్కిన్ క్లిప్ పరీక్ష చేసి క్రిములను గుర్తించి వైద్యాన్ని అందిస్తారు. కుష్టు లక్షణాలు ఉన్నావారు కంటి విషయంలోనూ, అవయవాలపై జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రస్తుతం వైద్య, ఆరోగ్య శాఖ ద్వారా సురక్షితమైన మందులను అందిస్తున్నారు.

సకాలంలో గుర్తిస్తే తగ్గించుకోవచ్చు..



- డాక్టర్ రజిత, రాజన్న సిరిసిల్ల జిల్లా వైద్యాధికారి

కుష్టు వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి. సకాలంలో గుర్తిస్తే మందులతో సులువుగా తగ్గించుకోవచ్చు. వ్యాధి లక్షణాలను గుర్తించి వారికి మందులు అందించడానికి సర్వేలు నిర్వహిస్తున్నాం. కొంత మంది శరీరంపై ఏర్పడే మచ్చలపై నిర్లక్ష్యం చేస్తున్నారు. వీరిలో అవగాహన కల్పించడానికి కుష్టు వ్యాధి నివారణకు పక్షోత్సవాలు నిర్వహిస్తున్నాం.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా మందులు...

- డాక్టర్ అనిత, రాజన్న సిరిసిల్ల జిలా ప్రోగ్రాం అధికారి

జనవరి 30న కుష్టు నివారణ దినోత్సవం నుంచి ఫిబ్రవరి 13 వరకు ప్రతి గ్రామంలో వ్యాధిపై అవగాహన కల్పిస్తాం. ప్రజల్లో ఎవరికైనా ఏమైనా మచ్చలు ఉంటే ఆశా కార్యకర్తకు, ఆరోగ్య కేంద్రానికి వెళ్లి చికిత్సలు చేసుకోవాలి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా మందులు అందిస్తాం.



అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తాం...

- డాక్టర్ సుధారాజేంద్ర, కరీంనగర్ జిల్లా కుష్టు వ్యాధి నివారణ అధికారి



కుష్టు వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించడంలో భాగంగా బుధవారం మానకొండూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో శిబిరాన్ని నిర్వహిస్తున్నాం. ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 13వరకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తాం. 'కలిసి అవగాహన పెంచుకుందాం-అపోహలను తొలగించు కుందాం'.. అనే నినాదంతో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తాం.

ట్రాక్టర్ బోల్తా పడి యువ రైతు మృతి

రాయికల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తన వ్యవసాయ భూమిలో పొలం దున్నుతుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడి యువరైతు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రామాజీపేట గ్రామానికి చెందిన ఇద్దం నవీన్‌రెడ్డి (27) అనే యువ రైతు తన కేజీవీల్ ట్రాక్టర్‌ను తీసుకువెళ్లి రామాజీపేట- కుమ్మరి పెల్లి గ్రామాల మధ్యగలతన భూమిలో బుధవారం వరినాట్ల కోసం దున్నుతుండగా ట్రాక్టర్ బురదలో దిగబడింది. ట్రాక్టర్ నుంచి కేజీవీల్ తొలగించే క్రమంలో ట్రాక్టర్ ఒక్కసారిగా బోల్తా పడి నవీన్ మీద పడింది. దీంతో బురదలో కూరుకుపోయిన నవీన్ ఊపిరాడక సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. గమనించిన స్థానికులు జేసీబీ సహాయంతో ట్రాక్టర్ కింద నుంచి నవీన్ మృతదేహన్ని బయటకు తీశారు. పోలీసులు మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నవీన్‌కు భార్య, ఐదేళ్లలోపు కుమారుడు, కూతురు ఉన్నారు. నవీన్ తండ్రి ఇటీవల మృతి చెందడంతో ఇంటికి పెద్ద దిక్కుగా ఉండగా, అతని మృతితో కుటుంబం కన్నీరుమున్నీరవుతుంది. మృతుని కుటుంబసభ్యుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధీర్‌రావు తెలిపారు.


నవీన్ (ఫైల్)

అనుపురంలో శివలింగం మాయం

వేములవాడ టౌన్, జనవరి29 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మండలం అనుపురం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ప్రతిష్ఠించిన శివలింగాన్ని మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారు. మాఘ అమావాస్యను పురస్కరించుకుని బుధవారం పూజలు నిర్వహించేందుకు వెళ్లిన గ్రామస్థులు ఆలయంలో శివలింగం లేకపోవడం గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో బీజేపీ నాయకుడు ఎర్రం మహేష్ ఆధ్వర్యంలో వెంటనే పోలీసుల సమక్షంలో నూతన శివలింగాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విగ్రహాన్ని అపహరించిన వారిని పట్టుకుని చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు.

గడ్డంపల్లెలో తాళం వేసిన ఇంట్లో చోరీ

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రామగిరి మండలం సుందిల్ల గ్రామపరిధిలోని గడ్డంపల్లె గడ్డం రాజయ్య ఇంట్లో చోరీ జరిగింది. ఇంటి యజమాని రాజయ్య అనారోగ్యం బారిన పడడంతో మూడురోజుల కిత్రం కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్నారు. బుధవారం ఇంటికి వచ్చేసరికి తాళాలుపగులగొట్టి ఉండడాన్ని గమనించి గోదావరిఖని టూటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ ప్రసాదరావు చోరీ జరిగిన తీరును గమనించి, రాజయ్య కుటుంబ సభ్యుల నుండి అపహరణకు గురైన సొత్తు వివరాలను తెలుసుకున్నారు. 100తులాల వెండి, తులం బంగారు ఆభరణం, రూ.50వేల నగదు చోరీకి గురైనట్టు బాధితులు పోలీసులకు తెలిపారు.

దైవదర్శనానికి వెళుతూ అనంతలోకాలకు

- రోడ్డు ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం
- మృతులు సిద్దిపేట వాసులు
- డ్రైవర్ నిద్రమత్తే ప్రమాదానికి కారణం

సుల్తానాబాద్ , జనవరి 29: (ఆంధ్రజ్యోతి): రెండు కుటుంబాలు దైవ దర్శనం కోసం బయలుదేరగా రోడ్డు ప్రమాద రూపంలో మృత్యువు వారిని కబళించింది. సిద్దిపేట జిల్లా కేంద్రం నుంచి జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం ఆలయ దర్శనానికి కారులో బయలుదేరగా పెద్దపల్లి జిల్లా కాట్నపల్లి శివారులో కారు కల్వర్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట శ్రీనగర్ కాలనీకి చెందిన ఆకుల కనుకయ్య (60) ఆయన భార్య ఆకుల తార (50)తో పాటు వారి కుమారుడు ఆకుల శ్రీనివాస్, వియ్యంకుడు జంగిటి జనార్ధన్ (45) ఆయన భార్య రమాదేవి, వీరి కుమారుడు జంగిటి మనోజ్‌కుమార్‌తోపాటు ఆకుల మాన్విత, ఆకుల ఆర్యన్‌లు డ్రైవర్‌తో కలిపి తొమ్మిది మంది కారులో బుధవారం తెల్లవారుఝామున మూడు గంటల ప్రాంతంలో దైవదర్శనం కోసం బయలుదేరారు. సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి వద్ద రాజీవ్ రహదారి పై కల్వర్టును ఢీకొంది. వేగంగా వస్తున్న కారు కల్వర్టు గోడను ఢీ కొనడంతో కారు ముందు బాగంగా నుజ్జు నుజ్జు అయింది. కారు ముందు సీట్లలో కూర్చున్న ఆకుల కనుకయ్య, తార దంపతులు అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన జంగిటి జనార్ధన్‌ను కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆకుల శ్రీనివాస్, రమాదేవి, ఆర్యన్, మాన్విత, మనోజ్‌కుమార్‌తో పాటు డ్రైవర్ వై బాల్‌రెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న సుల్తానాబాద్ ఎస్ఐ శ్రావణ్ కుమార్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన వారిని కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. కాగా డ్రైవర్ నిద్ర మత్తు కారణంగా ప్రమాదం జరిగిందని పోలీసులు పేర్కొన్నారు.


జనార్ధన్


ఆకుల కనుకయ్య, ఆకుల తార


కల్వర్టును ఢీ కొన్న కారు

నాలుగురోజులైనా మిస్టరీ వీడని మమత కేసు

- 25న మంచిర్యాలలో కారెక్కి.. 27న గంగాధరలో శవమైన మమత

గంగాధర, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మమత(30) హత్యకేసు మిస్టరీ నాలుగు రోజులైనా వీడలేదు. మమతది కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట మండలం. భర్తతో గొడవపడిన ఆమె నాలుగు నెలల క్రితం మంచిర్యాలలోని బంధువుల ఇంటికివచ్చింది. ఈనెల 25న ఆమె నూనె ప్యాకెట్ తీసుకొస్తానని చెప్పి కొడుకును తీసుకుని కారులో ఎక్కిన మమత 27న గంగాధర మండలం కురిక్యాల వరదకాలువ సమీపంలో శవమై కనిపించింది. గంగాధర పోలీసులు అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. వివిధ పత్రికల్లో వచ్చిన కథనానికి కుమరం భీం ఆసిఫాబాద్‌లోని తల్లిదండ్రులు గంగాధర పోలీసులకు తమ కూతురేనని సమాచారం అందించారు. ఐదేళ్లకింద భరత్ అనే వ్యక్తినిప్రేమపెళ్లి చేసుకోగా వారికి కుమారుడు ధృవన్(4) ఉన్నాడు. అయితే భార్యభర్తల మధ్య మనస్పర్థలతో మమత నాలుగు నెలలుగా తల్లిగారింట్లో ఉంటోంది. ఈనెల 25న పెంచికల్‌పేట తల్లిగారింట్లో నుంచి నూనె ప్యాకెట్ తీసుకొస్తానని చెప్పి కుమారుడిని తీసుకుని కారులో ఎక్కినట్లు సీసీ ఫుటేజీల్లో రికార్డైంది. 27న గంగాధర మండలంలో మమత శవమై కనిపించింది. అయితే మమతను చున్నీతో హత్య చేయగా నాలుగు రోజులైనా కుమారుడి ఆచూకీ లభ్యం కాలేదు. మమతను కారులో తీసుకొచ్చింది ఎవరు.. అక్కడే హత్యచేసి గంగాధరలో పడేశారా లేక ఇక్కడే హత్య చేశారానేది ఇప్పటికీ మిస్టరీగానే మిగిలింది. మార్చ్యూరీలో ఉన్న మమత మృతదేహాన్ని బుధవారం తల్లిదండ్రులు, భర్త గుర్తించారు. అనంతరం మమత మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి వారికి అప్పగించారు. ప్రస్తుతం ఈ కేసు గంగాధర పోలీసులకు సవాలుగా మారింది. కారు ఆచూకీ కోసం ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలో పలు సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. ఎవ్వరు హత్య చేశారు, హత్యలో ఎంతమంది పాల్గొన్నది, కారు లభిస్తేనే పూర్తి వివరాలు తెలుస్తాయని పోలీసుల భావిస్తున్నారు.


మమతతో కొడుకు ధృవన్(ఫైల్)

కాసిపేటలో ముగిసిన మమత అంత్యక్రియలు..

కాసిపేట: జగిత్యాల జిల్లా గంగాధర మండలం కుడిక్యాల వరద కాలువసమీపంలో అనుమానాస్పదంగా మృతిచెందిన మేడ మమత(30) అంత్యక్రియలు బుధవారం మంచిర్యాల జిల్లా కాసిపేట గ్రామంలో అత్తింటి వారు నిర్వహించారు.

ధృవన్ ఎక్కడ?

- సెల్‌ఫోనే కీలక ఆధారం..
- పోలీసుల అదుపులో అనుమానితులు?

కరీంనగర్‌క్రైం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మమతతోపాటే ఉన్న కొడుకు జాడ మూడు రోజులైనా తెలియకుండా పోయింది. మృతదేహంపై ఉన్న గాయాల ఆధారంగా ఆమెది హత్యగా భావిస్తున్నారు. కానీ ఆమెతో ఉన్న కొడుకు, సెల్‌ఫోన్‌లు ఎక్కడ ఉన్నాయనేది తెలిస్తే మమత మృతికి కారణాలు వెల్లడయ్యే అవకాశముంది. మమత వెళ్లిన కారు ఎవరిది? కారులో వచ్చినవారు మమతకు పరిచయస్థులేనా? లేదా మాయమాటలు చెప్పి తీసుకుపోయారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఫోన్‌మాట్లాడుకుంటూ వెళ్ళిన మమత దారిలోనే కారులో ఎక్కి వెళ్ళటం చూస్తే కారులో వచ్చిన వ్యక్తులు ఆమెకు పరిచయస్తులేనని వెల్లడవుతోంది. మమత అనుమానాస్పదస్థితిలో శవమై కనిపించడం, ఆమె కొడుకు జాడకోసం పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

మమత మృతి మిస్టరీని ఛేదించేందుకు 4స్పెషల్ పోలీసుటీంలను ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఒకటీం మంచిర్యాల నుంచి గంగాధర వరకు సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తుండగా మరోటీం సెల్‌ఫోన్ టవర్‌డంపు ఆధారంగా అనుమానిత ఫోన్‌కాల్స్‌ను పరిశీలిస్తూ మిస్టరీని ఛేధించే పనిలో ఉన్నట్లు తెలిసింది. మరో వైపున అదృశ్యమైన ధృవన్ కోసం పోలీసులు వివిధ ప్రాంతాల్లో గాలిస్తున్నారు. మమత కుటుంబ సభ్యులతోపాటు బంధువులు, ఆమె భర్త, బంధువులను ఇప్పటికే విచారించిన పోలీసులు మరికొందరు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. ధృవన్‌ను క్షేమంగా పట్టుకోవటమే ప్రధానధ్యేయంగా పోలీసులు అప్రమత్తంగా ఏ చిన్న ఆధారం, సమాచారాన్ని కూడా వదిలి పెట్టకుండా నిశితంగా పరిశీలిస్తూ ఉన్నతాధికారుల సూచనలతో ముందుకుసాగుతున్నారు.

దొంగతనానికి వచ్చి.. సీసీ కెమెరాకు చిక్కి..

- నిందితుడిని బంధించిన కాలనీవాసులు..
- పోలీసులకు అప్పగింత


చోరీకి యత్నించిన దొంగ

వేములవాడ, జనవరి29 (ఆంధ్రజ్యోతి): ఇళ్లలో చోరీకి యత్నించిన ఓ దొంగ సీసీ కెమెరాకు చిక్కాడు. దీంతో స్థానికులకు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. వేములవాడ పట్టణంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. స్థానిక మోచివీధిలో బుధవారం తెల్లవారు జామున దొంగతనం కోసం వచ్చిన ఓ వ్యక్తి ముందుగా రెండు ఇళ్లలో చొరబడ్డాడు. అదేక్రమంలో మూడో ఇంటికి వెళ్లి పైఅంతస్తులోకి ప్రవేశించి అందిన కాడికి కాజేశాడు. అయితే గోడ దూకుతున్న శబ్దం రావడంతో ఇంటి యజమానికి మెలుకువవచ్చి అనుమానంతో సీసీ కెమెరాలు పరిశీలించగా దొంగ ఇంటిలోకి ప్రవేశిస్తున్న దృశ్యాలు కనిపించాయి. అదే సమయంలో దొంగపక్కనే ఉన్న ఇంటిలోకి దూకడంతో పక్కింటి వారికి ఫోన్ చేసి అప్రమత్తం చేశాడు. వెంటనే వాళ్ల తేరుకొని చుట్టుపక్కల వారిని లేపడంతో దొంగను పట్టుకొని బంధించి పోలీసులకు అప్పగించారు. సీసీకెమెరాలో తన ముఖం కనబడకుండా టవల్ కప్పుకోవడంతోపాటు తలుపులు ఇతర వస్తువులపై వేలిముద్రలు పడకుండా గ్లౌజ్ ధరించడం గమనార్హం. దొంగతనం చేసే క్రమంలో కొంత నగదుతో పాటు వెండిని కూడా చోరీచేయగా ప్రస్తుతం వేములవాడ పట్టణపోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. దొంగతనంఘటనలో అనుమానితుడిని విచారిస్తున్నామని సీఐ వీరప్రసాద్ తెలిపారు.

ఇసుక అక్రమ రవాణా కేసులో ఇద్దరి అరెస్ట్

సిరిసిల్ల క్రైం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుకరవాణా చేస్తున్న వ్యక్తితోపాటు డబ్బులు డిమాండ్ చేస్తూ బెదిరింపులకు పాల్పడిన వ్యక్తులిద్దరిని బుధవారం అరెస్ట్ చేశామని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ముస్తాబాద్ మండలంలోని కొండాపూర్ శవారులోని మానేరు వాగునుంచి టిప్పర్ ద్వారా పాక చంద్రమౌళి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నాడని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఇసుకను అక్రమంగా రవాణాచేస్తుండగా వీడియోలుతీసి రూ.10వేలుఇవ్వాలని బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిపై పిర్యాదు రావడంతో కేసు నమోదు చేశామన్నారు. ఇద్దరు వ్యక్తులను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించా మని ఆయన తెలిపారు. ఈ కేసులోటిప్పర్, లారీ, కారును సీజ్ చేశామన్నారు.

అక్రమ వసూళ్లకు పాల్పడిన వ్యక్తి అరెస్ట్

సిరిసిల్ల పట్టణంలోని చంద్రంపేట వద్ద కలప లోడుతో వస్తున్న ట్రాక్టర్‌ను ఆపి అక్రమ వసూళ్లకు పాల్పడిన వ్యక్తిపై కేసునమోదుచేసి అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని టౌన్ సీఐ కృష్ణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ముస్తాబాద్, జనవరి29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నామాపూర్‌లో బుధవారం ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. కామారెడ్డికి చెందిన పెంగర్లరాజు(30) చీకోడు గ్రామంలో నివసిస్తున్నాడు. కాగాపనిమీద ముస్తాబాద్ వచ్చి వెళ్తుండగా నామాపూర్ శివారులో ఎదురుగా ద్విచక్రవాహనం రావడంతో ఢీకొని తీవ్రగాయాల పాలయ్యాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. అతనికి భార్య ఉమ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల సందడి

- షెడ్యూల్ విడుదల చేసిన ఎన్నికల సంఘం
- ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ
- కాంగ్రెస్ అభ్యర్థులపై కొనసాగుతున్న సస్పెన్స్



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికల షెడ్యూల్ విడుదల కాగానే జిల్లాలో ఒక్కసారిగా ఎన్నికల హడావుడి మొదలైంది. కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలా బాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీల పదవీ కాలం మార్చి 29తో ముగియనుంది. ఆయా రాజకీయపార్టీల్లోని ఆశావహులు నాలుగు నెలల క్రితం నుంచే ఓటర్లను చేర్పించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలోని 42 అసెంబ్లీ స్థానాలు, ఆరు పార్లమెంట్ స్థానాల్లోని పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఈ ఎన్నికల్లో ఓటు చేయనున్నందున ఈ ఎన్నికలకు ప్రాధాన్యం పెరిగింది. మేధావి వర్గంగా భావించే పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఈ ఎన్నికల్లో ఇచ్చే తీర్పు ప్రజాభిప్రాయానికి ప్రతీకగా నిలిచింది. తమ భవిష్యత్ రాజకీయాలను ప్రభావితం చేస్తుందని రాజకీయ పార్టీలు భావిస్తున్నాయి. ఈ ఎన్నికల్లో గెలుపుపై ఆయా పార్టీలు ప్రత్యేక దృష్టిసారించనున్నాయి. ఎన్నికలు ఫిబ్రవరిలో జరుగుతాయని మొదటి నుంచే తెలిసిన నేపథ్యంలో నాలుగు నెలల క్రితం నుంచే ఆయా పార్టీల నుంచి పోటీచేసే ఆశావహులు ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని పోటాపోటీగా చేపట్టారు. నాలుగు జిల్లాల్లో వారు విస్తృతంగా పర్యటించి ఓటర్లను చేర్పించడమే కాకుండా తామే అభ్యర్థిగా ప్రచారం చేసుకొని మద్దతు కూడగట్టుకునే ప్రయత్నం చేశారు. అధికార కాంగ్రెస్ నుంచి అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి నరేందర్‌రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగానికి రాజీనామా చేసిన ప్రసన్న హరికృష్ణతోపాటు మరికొందరు టికెట్ ఆశిస్తున్నారు. ఎంఐఎం రాష్ట్ర నాయకుడు డాక్టర్ బీఎస్‌రావు, కరీంనగర్ మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్, ట్రస్మా రాష్ట్ర మాజీ చైర్మన్ యాదగిరి శేఖర్‌రావు బీఆర్ఎస్ టికెట్ ఆశిస్తున్నారు. బీజేపీ అభ్యర్థిగాచెందిన అంజిరెడ్డిని ఆ పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. వీరందరూ ముమ్మరంగా ఓటర్లను నమోదు చేయిస్తూ ముందస్తు ప్రచారాలను నిర్వహించారు. ఈ కారణంగానే ఓటర్ల సంఖ్య గతంలో ఎన్నడూ లేని విధంగా 3.5 లక్షలకు చేరింది.

● కమలంలో కదనోత్సాహం...

పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలపై బీజేపీ కదనోత్సాహాన్ని ప్రదర్శిస్తున్నది. ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వం పట్టభద్రుల స్థానానికి మెదక్ జిల్లాకు చెందిన సి అంజిరెడ్డిని, ఉపాధ్యాయస్థానానికి పెద్దపల్లి జిల్లాకు చెందిన మల్క కొమురయ్యను అభ్యర్థులుగా ప్రకటించింది. 20 రోజుల క్రితమే అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ నియోజకవర్గ పరిధిలోని అన్ని ఉమ్మడి జిల్లాల్లో సమావేశాలు నిర్వహించి అభ్యర్థులకు మద్దతుగా పార్టీశ్రేణులు, నేతలను సమాయత్తం చేయడంతోపాటు బాధ్యతలను అప్పగించింది. రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లో కూడా ఈ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాన్ని చర్చించి, ఖరారు చేశారు. పట్టభద్రుల స్థానానికి అభ్యర్థిగా ఎంపిక చేసిన అంజిరెడ్డి భార్య గోదావరి ప్రస్తుతం బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలుగా పని చేస్తున్నారు. ఉపాధ్యాయ అభ్యర్థి మల్క కొమురయ్య హైదరాబాద్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నిర్వాహకుడు. పల్లవి గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఆయన మల్కాజిగిరి ఎంపీ స్థానానికి పోటీ చేయడానికి ఆసక్తి చూపించి టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. ప్రస్తుతం ఎమ్మెల్సీ అభ్యర్థిగా రంగంలోకి దిగారు. వీరికి కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ అండదండలు ఉన్నాయని, ఆ కారణంగానే వారు అభ్యర్థులుగా తెరపైకి వచ్చారని ప్రచారం జరుగుతోంది. పట్టభద్రుల స్థానానికి టికెట్ ఆశించిన సుగుణాకర్‌రావు, రామకృష్ణారెడ్డి పార్టీ నిర్ణయంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. వారిద్దరు బాహాటంగానే తమ అసంతృప్తిని వెలిబుచ్చారు. సుగుణాకర్‌రావు ఇప్పటికీ ఎన్నికల బరిలో ఉండే ఆలోచనలో ఉన్నట్లుగానే ప్రచారం జరుగుతున్నది.

● తేలని కాంగ్రెస్ అభ్యర్థి

అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎంపిక విషయంలో తర్జనభర్జన పడుతోంది. టీపీసీసీ స్థాయిలో రెండుసార్లు చర్చలు జరిగినా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, కేసీ వేణుగోపాల్ రాష్ట్రానికి వచ్చి నాయకులతో చర్చించినా అభ్యర్థి ఎవరన్నది తేలలేదు. ప్రధానంగా అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి, ప్రసన్న హరికృష్ణ పోటీలో ఉన్నారు. వీరిలో మెజార్టీ నేతలు నరేందర్‌రెడ్డి వైపే మొగ్గుచూపుతున్నారని, నాలుగు జిల్లాల పరిధిలో నియోజకవర్గం విస్తరించి ఉన్నా ఓటర్లలో 50 శాతం కరీంనగర్‌జిల్లాకు చెందినవారే ఉన్నారు. దీంతో ఇక్కడి అభ్యర్థినే పోటీలోకి దింపితే బాగుంటుందనే అభిప్రాయాన్ని ఉమ్మడి జిల్లా నేతలు వ్యక్తం చేసినట్లు సమాచారం. అధిష్ఠానం మాత్రం ఇప్పటికీ ఈ విషయంలో ఎలాంటి స్పష్టత ఇవ్వడం లేదు.

● సందిగ్ధంలో బీఆర్ఎస్

ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్ ఈ ఎన్నికల విషయంలో స్తబ్ధంగా ఉంది. ఆ పార్టీకి చెందిన రవీందర్‌సింగ్, బీఎస్‌రావు, యాదగిరి శేఖర్‌రావు టికెట్ ఆశించి నాలుగు నెలలుగా ప్రచారం చేసుకుంటున్నా పార్టీ మాత్రం ఇప్పటి వరకు జిల్లాస్థాయిలోగానీ, రాష్ట్రస్థాయిలోగానీ ఈ ఎన్నికల విషయంలో ఎలాంటి సమావేశాన్ని నిర్వహించలేదు. దీంతో ఈ ఎన్నికల్లో పార్టీ అధికారికంగా అభ్యర్థిని నిలుపక పోవచ్చని అభిప్రాయం నెలకొన్నది. అధిష్ఠానం విషయాన్ని స్పష్టం చేయకపోవడంతో తాము మాత్రం పోటీలో ఉంటామంటూ నేతలు సోషల్ మీడియా ద్వారా ఇతరత్రా ప్రచార సాధనాల ద్వారా ప్రచారం చేసుకుంటున్నారు. యాదగిరి శేఖర్‌రావు తాను ఇండిపెండెంట్‌గా బరిలో ఉండనున్నట్లు ప్రకటించగా కరీంనగర్ మాజీ మేయర్ రవీందర్‌సింగ్ పార్టీ అభ్యర్థిగా ఎంపిక చేస్తే పార్టీ పేరిట లేకపోతే ఇండిపెండెంట్‌గా పోటీలో ఉంటానని ప్రకటించారు. బీఎస్ రావు కూడా అదే ఆలోచనతో ఉన్నట్లు తెలిసింది. ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేయడంతో పాటు మార్చి 3 నుంచి నామినేషన్లు ప్రారంభం కానుండడంతో అభ్యర్థుల విషయంలో ఒకటి రెండు రోజుల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రకటన చేస్తాయని భావిస్తున్నారు.

రియాద్‌లో గ్లోబల్ లేబర్ మార్కెట్ సదస్సు

● హాజరైన గల్ఫ్ కార్మిక నేతలు



రియాద్ సదస్సుకు హాజరైన గల్ఫ్ కార్మిక నేతలు భీంరెడ్డి, చేతన తదితరులు

జగిత్యాల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): సౌదీ అరేబియా రాజధాని రియాద్‌లో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న గ్లోబల్‌లేబర్ మార్కెట్‌సదస్సు బుధవారం ప్రారంభమైంది. 45దేశాల కార్మిక మంత్రులు, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు, 200 మంది వక్తలు, 100కు పైగా దేశాలనుంచి సుమారు 5వేలకు పైగా ప్రతినిధులు పాల్గొన్నారు. ఇండియన్ నేషనల్ ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ (ఐఎన్‌టీయూసీ) జాతీయఉపాధ్యక్షుడు రామచంద్రకుంతియా, తెలంగాణకు చెందిన వలస కార్మికసంఘ నాయకుడు మంద భీంరెడ్డి, రియాద్‌లో నివసిస్తున్న ఏపీకిచెందిన సామాజిక సేవకురాలు చేతన ఈ సదస్సులో పాల్గొని ప్రసంగించారు. ఈ సదస్సులో ప్రభుత్వ, ప్రైవేటు రంగం, అంతర్జాతీయ కార్మిక సంస్థ ప్రతినిధుల మధ్య సమావేశాలు జరిపారు. కీలకమైన లేబర్ మార్కెట్ సవాళ్లను పరిష్కరించడం, వినూత్న పరిష్కారాలు, ఉత్తమ పద్ధతులు, ప్రపంచ అనుభవాలపై ఈ సదస్సులో చర్చించనున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన చెగ్యాం విద్యార్థులు



లాస్య, ఉదయశ్రీ, అమరేందర్

వెల్గటూర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెగ్యాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎంఈవో ప్రభాకర్, పీడీ మహేష్ తెలిపారు. నవంబరు 18న పెద్దపల్లిలో నిర్వహించిన జోనల్ స్థాయి అండర్ 14 బాల బాలికల విభాగంలో సందవేని మధుశ్రీ, కూనారపు లాస్య, సందవేని అమరేందర్‌లు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 29 నుండి 31 వరకు మెదక్ జిల్లాలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలలో వారు పాల్గొననున్నారు. కాగా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన మధుశ్రీ, లాస్య, అమరేందర్‌లను ఎంఈవో ప్రభాకర్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సామల కవిత, పీడీ మహేష్, కమిటీ సభ్యులు, ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు అభినందించారు.

ధర్మపురి క్షేత్రంలో భక్తుల రద్దీ

ధర్మపురి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ధర్మపురిలో బుధవారం భక్తుల రద్దీ పెరిగింది. అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మౌని అమవాస్య పురస్కరించుకుని సుదూర ప్రాంతాల నుంచి క్షేత్రానికి భారీగా భక్తులు తరలివచ్చారు. నరసింహుని ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్యకల్యాణం జరిపించారు. శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయం ఆవరణలో గల రావి చెట్టు ఆంజనేయ స్వామి చుట్టు భక్తులు ప్రదక్షిణలు చేశారు. యమ ధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. అందంగా పూలతో అలంకరించిన స్వామివారలకు ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ తదితర వేదబ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రివరకు భక్తులు స్వామివారలను దర్శనం చేసుకున్నారు. ఆలయఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది సేవలు అందించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్, రాజగోపాల్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.



దర్శనం కోసం క్యూలో వేచి ఉన్న భక్తులు

కండ్లపల్లిలో అరుదైన శిల్పాలు

● పరిశీలించిన కొత్త తెలంగాణ చరిత్ర బృందం

బీర్‌పూర్,జనవరి 29(ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండలంలోని కండ్లపల్లిలో అరుదైన 8వ శతాబ్దం నుంచి 18వ శతాబ్దం వరకు వేరు వేరు కాలాలకు చెందిన అపురూప శిల్పాలు వెలుగుచూశాయి. విషయం తెలుసుకున్న కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ బృందం సభ్యులు బుధవారం కండ్లపల్లి గ్రామానికి వెళ్లి శిల్పాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కండ్లపెల్లి గ్రామంలో గుర్తించినశిల్పాలు వెయ్యేళ్ల చరిత్రగల శిల్పాలని, జైనం, శైవం, వైష్ణవం శిల్పాలని అన్నారు. వాటి నమునాలు చూస్తే 8వ శతాబ్దం నుంచి 18వశతాబ్దం వరకు వేర్వేరు కాలాలకు చెందిన శిల్పాలుగా గుర్తించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యులు వొద్దిపర్తి మధుకుమార్, చిట్టేని విజయ్ కుమార్, గ్రామ ప్రజల సహకారంతో గ్రామంలోని పలు ప్రదేశాలను పరిశీలించి శిల్పాలను గుర్తించారు. గుర్తించిన శిల్పాలలో రాష్ట్రకూటశైలి జైనతీర్థంకరుడు రుషభుని ధ్యానాసన శిల్పం,మరి రెండు వృషభలాంఛనాలతో రుషభుని శిల్పస్తంబాలు, వర్ధమహావీరుని అధిష్ఠానపీఠం, జైనబసది పూర్ణకలశం, 14, 15వ శతాబ్దాల శైలిలో గణపతి, కేశవమూర్తులిద్దరు, కుబేరుడు, విష్ణుమూర్తి, మహిషాసురమర్దని, నాగదేవత, 17,18వ శతాబ్దల శైలిలోచెక్కిన లోహకారుల దేవత మమ్మాయి శిల్పాలు, గుర్తించడానికి వీలు పడకుండా శిథిలమైన రెండు బహుభుజుల దేవతల శిల్పాలు గుర్తించినట్లు తెలిపారు. గ్రామంలోని గంగాధరి కోటయ్య ఇంటివద్ద జైన తీర్థంకరుని శిల్పంతో శాసనస్తంభం బయటపడ్డాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అద్భుతమైన వారసత్వ సంపదను పరిరక్షించి బావితరాలకు మన ఘన చరిత్రను తెలియజేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ దిశలో చరిత్రను, చారిత్రక ప్రదేశాలను తెలంగాణ చరిత్ర బృందం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అనేక విశేషాలని సరియైన నిర్ధారణతో ఆవిష్కరించినట్లు కొత్త తెలంగాణ చరిత్రబృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ తెలిపారు. ఈ శిల్పాల పరిశీలన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పర్వతం రమేష్ గౌడ్, గంగాధరి పూర్ణచందర్, వడ్లూరి రవి, కోట కిషన్ గౌడ్, గంగాధరి శంకర్ గౌడ్,పోతుగంటి శ్యాంసుందర్ గైడ్, అజ్మీర లక్ష్మన్, గంగాధరి గంగాధర్, కంది భీమన్న తదితరులు ఉన్నారు.



పురాతన విగ్రహాలను పరిశీలిస్తున్న కొత్త తెలంగాణ చరిత్ర బృందం



బయటపడ్డ పురాతన అపురూప శిల్పాలు

పంట పొలాల్లోకి భారీగా కెనాల్ నీరు



పొలాల్లో భారీగా చేరిన కెనాల్ నీరు

శంకరపట్నం, జనవరి 29 (ఆంధ్ర జ్యోతి): మండలం అంబాలాపూర్ గ్రామ శివారులో కాకతీయ ప్రధానకాలువ నుంచి డీబీఎం-12 ఉపకాలువద్వారా నీరు అధికంగా వదలడంతో పంట పొలాలకు భారీగా నీరుచేరింది. దీంతో వరిపంటకు తీవ్రనష్టం జరుగుతుందని రైతులు పేర్కొంటున్నారు. ఈసందర్భంగా బుధవారం వారు సంబంధిత అధికారులు చొరవ తీసుకొని పంటపొలాల్లోకి నీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

జాతీయస్థాయి టెన్నికాయిట్ పోటీలకు సైనిక్ స్కూల్ విద్యార్థి

చొప్పదండి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి టెన్నికాయిట్ పోటీలకు రుక్మాపూర్‌సైనిక్‌స్కూల్ 12వతరగతివిద్యార్థి బలరాం ఎంపికయ్యాడు. ఇటీవల కరీంనగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. విద్యార్థిని స్కూల్ డైరెక్టర్ కల్నల్ కేసీరావు, ప్రిన్సిపాల్‌కాళహస్తి, ఉపాధ్యాయులు అభినందించారు.

క్రీడలతో సమాజంలో మంచి గుర్తింపు

● సీపీ అభిషేక్ మొహంతి ● కొనసాగుతున్న రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడలు



కబడ్డీలో తలపడుతున్న హైదరాబాద్ సిటీ, తెలంగాణ ఇంటెలిజెన్స్ జట్లు



కబడ్డీలో తలపడుతున్న జోన్3 రాజన్న సిరిసిల్ల, బాసర మహిళా జట్లు

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి అన్నారు. కరీంనగర్ పోలీస్ పరేడ్ గ్రౌండ్, సీటీసీ, అంబేద్కర్ స్టేడియంలో కొనసాగుతున్న మూడో రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడలను రెండో బుధవారం ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశామన్నారు. క్రీడలతో స్నేహసంబంధాలు పెంపొందుతాయన్నారు. రాష్ట్రస్థాయిలో రాణించాలని, జాతీయస్థాయి పోటీల్లో తెలంగాణ క్రీడాపతాకాన్ని ఎగురవేయాలని అన్నారు. తెలంగాణ స్పోర్ట్స్ ఐజీపీ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందనారు. కరీంనగర్ అడిషనల్ ఎస్పీ శుభంప్రకాశ్, కరీంనగర్ ట్రైనీ ఐపీఎస్ వసుంధర యాదవ్, కరీంనగర్ ఏసీపీ విజయ్‌కుమార్, ఆర్ఐ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

● ప్రతిభ చాటుతున్న పోలీస్ క్రీడాకారులు..

మూడో తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడల్లో 20 పోలీస్ జోన్ల నుంచి 2500 మంది క్రీడాకారులు 29 క్రీడాంశాల్లో పాల్గొంటున్నారు. ఖో-ఖో, కబడ్డీ, హ్యాండ్‌బాల్, వాలీబాల్, ఫుట్‌బాల్, యోగ, జిమ్నాస్టిక్స్, రెజ్లింగ్, లాన్ టెన్నీస్, టేబుల్ టెన్నీస్, సైక్లింగ్, ఆర్చరీ, బాస్కెట్‌బాల్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, వాటర్ స్పోర్ట్స్, సెపక్ తక్రా, షటిల్ బ్యాడ్మింటన్‌లో పోటీలను నిర్వహిస్తున్నారు

జాతీయస్థాయిలో సత్తాచాటాలి: ఐజీ రమేష్ రెడ్డి



రెజ్లింగ్ పోటీలను ప్రారంభిస్తున్న ఐజీ రమేష్ రెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా పోలీస్‌మీట్‌లో తెలంగాణ రాష్ట్రరెజ్లర్లు సత్తాచాటాలని ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(క్రీడలు) రమేష్ రెడ్డి అన్నారు. 3వ తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడల్లో భాగంగా బుధవారం ప్రాంతీయ క్రీడాపాఠశాలలో రెజ్లింగ్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెజ్లింగ్‌లో అన్ని జోన్ల నుంచి పోలీసులు పాల్గొనడం సంతోషకరమన్నారు. జాతీయస్థాయిలో పతకాలు సాధించే క్రీడాకారులకు ప్రోత్సాహకాలతోపాటు ఇంక్రిమెంట్లు అందించనున్నట్లు చెప్పారు. తెలంగాణ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహ్మద్ కరీం మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగుల్లో అంతర్లీనంగా దాగిఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఈ పోలీస్ క్రీడలు దోహదపడతాయన్నారు. జాతీయ స్థాయి పోటీలకు ముందు ప్రత్యేక శిక్షణ శిబిరాలు నిర్వహిస్తే మన రాష్ట్ర క్రీడకారులు ఎక్కువ పతకాలు సాధించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో రూరల్ ఏసీపీ శుభం ప్రకాష్, తెలంగాణ జూడో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జనార్ధన్ రెడ్డి, స్పోర్ట్స్ ఆఫీసర్ రామారావు, డీవైఎస్‌వో శ్రీనివాస్, రెజ్లింగ్ ఇన్‌చార్జి శేఖర్ రెడ్డి, గచ్చిబౌలి స్టేడియం ఏవోఆర్ఐ మధు, కోచ్‌లు జైపాల్, రాజు, వంశీకృష్ణ, శిరీష, పూర్ణ సాయి, అఖిల్ పాల్గొన్నారు.

సదాశివపల్లి వద్ద జంక్షన్

ఏర్పాటు ఎప్పుడో?

- ప్రమాదాలకు నిలయంగా మారిన కూడలి
- ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వాహనదారుల ప్రయాణం

మానకొండూర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్ నగర పాలక సంస్థ సదాశివపల్లి కూడలి ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ కూడలి నుంచి ప్రతి రోజు పెద్ద వాహనాలు వెళుతుంటాయి. వరంగల్‌కు, హైదరాబాద్‌కు వెళ్లే వాహనాలు కరంనగర్ శివారులోని మానేరు వంతెన మీదుగా వెళ్లేవి. దీంతో వాహనాల రద్దీ పెరిగి ప్రతి రోజు ప్రమాదాలు జరుగుతుండేవి. ప్రమాదాలను తగ్గించేందుకు సదాశివపల్లి శివారులోని మానేరు వాగుపై తీగల వంతెనను నిర్మించారు. ఈ వంతెనను 20 నెలల క్రితం ప్రారంభించారు. తీగల వంతెన ఏర్పాటుతో నాలుగు కిలోమీటర్లు దూరం తగ్గడమే కాకుండా గోదావరిఖని ఇతర ప్రాంతాలకు వెళ్లే వాహనాలు చుట్టూ తిరగాల్సిన అవసరం తప్పింది. అలుగునూర్ నుంచి, వరంగల్ నుంచి, తీగల వంతెన నుంచి వచ్చే రోడ్లు మానకొండూర్ మండలం సదాశివపల్లి వద్ద కలుస్తాయి. ఈ మూడు రోడ్లు కలిసే కూడలి వద్ద జంక్షన్ ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎలాంటి సూచికలు లేకపోవడంతో మూడు వైపుల నుంచి ఒకే సారి వాహనాలు స్పీడ్‌గా రావడంతో తరుచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. తీగల వంతెనపై ప్రయాణించడం వల్ల దూరం తగ్గిందని సంబరపడ్డ వాహనదారులు ప్రమాదాలతో భయపడుతున్నారు. నగర పాలక సంస్థ పాలకులు తీగల వంతెన ను నుంచి సదాశివపల్లి బస్టాండ్ వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. సదాశివపల్లి వద్ద జంక్షన్ ఏర్పాటు చేయాల్సి ఉండగా పట్టించుకోవడం లేదు. దీంతో వాహనదారులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తున్నారు. గతంలో స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో ఇతర ప్రజాప్రతినిధులు సదాశివపల్లి కూడలిని సందర్శించి జంక్షన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినా ఇప్పటి వరకు నెరవేర్చలేదుప. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి జంక్షన్ ఏర్పాటు చేయాలని గ్రామస్థులు, వాహనాదారులు కోరుతున్నారు.



ప్రమాదాలకు నిలయంగా మారిన సదాశివపల్లి కూడలి ఇదే

జంక్షన్ ఏర్పాటు చేయాలి..



- మాచర్ల కోటేశ్వర్, సదాశివపల్లి గ్రామస్థుడు

తీగల వంతెన నిర్మాణం అయిందని సంతోషపడ్డాం. సదాశివపల్లి బస్టాండ్ వద్ద మూడు వైపుల నుంచి ఒకే సారి వాహనాలు రావడంతో రోడ్డు దాటాలంటే భయపడుతున్నాం. ఎన్నికల్లో గెలిపిస్తే మూడు నెలల్లో జంక్షన్ ఏర్పాటు చేస్తామని స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హామీ ఇచ్చారు. ఇప్పటికి నిర్మాణం ప్రారంభించలేదు. వెంటనే జంక్షన్ ఏర్పాటు చేయాలి.

భయంతో ప్రయాణిస్తున్నాం



- కముటం సంపత్, వాహనదారుడు

సదాశివపల్లి బస్టాండ్ వద్ద మూడు వైపుల నుంచి వాహనాలు వేగంగా వస్తున్నాయి. దీంతో రోడ్డు దాటడడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు దాటాలంటే భయమవుతోంది. పాలకులు, అధికారులు స్పందించి జంక్షన్ ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలి.

న్యూస్ బాక్స్

ట్రేడ్ లైసెన్స్ రెన్యూవల్ చేసుకోవాలి

రుద్రంగి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) దుకాణం యజమానులు ట్రేడ్ లైసెన్స్‌లను రెన్యూవల్ చేసుకోవాలని ఎంపీవో సుధాకర్ అన్నారు. మండల కేంద్రంలోని బుధవారం దుకాణ యజమానులకు ట్రేడ్ లైసెన్స్ లేనివాళ్లకు నోటీసులను అందజేశారు. ఈసందర్భంగా సుమారు 50 దుకాణాలకు నోటీసులు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. మూడు రోజుల్లో ట్రేడ్ లైసెన్స్ రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు. కార్యదర్శి రాందాస్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

ఇల్లంతకుంట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆరెపల్లి, అనంతారం గ్రామాల్లో సీఎం సహాయనిధి చెక్కులను బుధవారం కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ సర్పంచ్‌లు చింతలపెల్లి తిరుపతిరెడ్డి, చల్ల నారాయణ, చొప్పరి అశోక్, నాయకులు మచ్చ రాజేశం, గుడికందుల సురేందర్ రెడ్డి, చింతలపెల్లి లచ్చిరెడ్డి, తిరుపతిరెడ్డి, వెంకటేష్, మంద రవి, వెంకట్రాంరెడ్డి, బడుగు లింగం, దాస్, ఎల్లయ్య, అంజయ్య, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట : మండలంలోని బొప్పాపూర్ గ్రామ లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను స్థానిక బీఆర్ఎస్ నాయకులు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, దేవరెడ్డి, రజినీకాంత్, అశ్వక్, పద్మారెడ్డి, సత్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● తంగళ్లపల్లి : మండలంలోని గోపాలరావుపల్లెలో లబ్ధిదారులకు సీఎంఆర్ చెక్కులు కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మీరాల శ్రీనివాస్ యాదవ్, కడారి సునీల్‌రెడ్డి, ఎడ్ల ప్రేమ్ కుమార్, కొండవేని రవి, జంగం సత్తయ్య, కొండవేనీ దేవయ్య, బాల్‌రెడ్డి, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

● రుద్రంగి : రుద్రంగి మండలం దేవతండా గ్రామానికి చెందిన పలువురు బాధితులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బుధవారం బీఆర్ఎస్ నాయకులు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన ముగ్గురికి రూ.94 వేల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దేగవత్ తిరుపతి, నాయిని రాజేశం తదితరులు పాల్గొన్నారు

భక్తి తన్మయత్వంలో..

(5వ పేజీ తరువాయి)

ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ఎంపీడీవో సత్తయ్య, తదితరులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు.

● ముస్తాబాద్ : మండల కేంద్రంలోని శ్రీస్వయంభూ వెంకటేశ్వరస్వామి ఆలయ వద్ద, రామలక్ష్మణపల్లెలో మానేరు తీరంలోని రామాలయం, పోతుగల్‌లో రామాలయం, చీకోడ్‌లో లక్ష్మీనర్సింహస్వామి, కొండాపూర్‌లో ఆలయం వద్ద మాఘఅమావస్య జాతర బుధవారం ఘనంగా నిర్వహించారు. చీకోడ్, ముస్తాబాద్‌లో ఎడ్ల బండ్ల ప్రదర్శన ట్రాక్టర్ల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. మాజీ ఎంపీపీ శరత్‌రావు, మాజీ జడ్పీటీసీ గుండం నర్సయ్య, మాజీ సెస్ డైరెక్టర్ విజయరామారావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సురేందర్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, జాల భిక్షపతి, రవీందర్‌రెడ్డి, కంచం నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

● వేములవాడ కల్చరల్ : వేములవాడ మండలం కొడుముంజ రామప్ప శ్రీరామలింగేశ్వర జాతర ఘనంగా నిర్వహించారు. శ్రీ స్వామివారికి కల్యాణం నిర్వహించారు.కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరై ప్రత్యేక పూజలో పాల్గొన్నారు.

● వేములవాడ రూరల్ : మండలంలోని నాగాయపల్లిలో బుధవారం దుబ్బరాజేశ్వరస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం స్వామివారి రథోత్సవం నిర్వహించారు. స్వామివార్లను ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి తదితరులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. అర్చకులు వారికి స్వామివారి కండువా కప్పి ప్రసాదాన్ని అందజేసి ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

● చందుర్తి : మండలంలోని జోగాపూర్, మల్యాల గ్రామాల్లోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయాల్లో బుధవారం జాతర ఉత్సవాలు ఘనంగా జరిగాయి. శ్రీరాములవారి జాతరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ జడ్పీటీసీ సభ్యులు నాగం కుమార్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మ్యాకల గణేష్, నాగం రాజ మల్లయ్య, ధర్మపురి శ్రీనివాస్, మ్యాకల పర్శరాములు, వెంకట్‌రాములు, రాము, గణేష్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అలాగే తిమ్మాపూర్-నర్సింగాపూర్ గ్రామాల శివారులోని శ్రీలోంక వీరహనుమాన్ జాతర వైభవంగా జరిగింది. జాతరకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటున్నారు. భక్తుల రాక సాయంత్రం కొనసాగింది.

● కోనరావుపేట : మండలంలో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మామిడిపల్లి శ్రీ సీతారాముల ఆలయం, నాగారం కోదండరామ స్వామి ఆలయం, మల్కపేట రామాలయం, ధర్మారం వెంకటేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిట లాడాయి. మామిడిపల్లి శ్రీ సీతారాముల స్వామివారిని సుమారు 50వేల మంది భక్తులు పాల్గొని దర్శించుకున్నారు. స్వామివారిని బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చెలిమెడ లక్ష్మీనరసింహారావు, ఏనుగు మనోహర్‌రెడ్డి, రాఘవరెడ్డి, బండ నర్సయ్య, రామ్మోహన్‌రావు, మల్యాల దేవయ్య, గోపు పరశురాములు, బీజేపీ మండల అధ్యక్షుడు బాలాజీ, మాజీ జడ్పీటీసీ పల్లం అన్నపూర్ణ, బైరగోని సురేష్ తదితరులు దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా వేములవాడ ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, నాగారం కోదండరామ స్వామి ఆలయ కమిటీ సభ్యులు చెన్నమనేని శ్రీకుమార్ ఏర్పాట్లు చేశారు. మామిడిపల్లి ఆలయ ఏర్పాట్ల పర్యవేక్షణలో అధికారులు గుట్ట శ్రావణ్, బ్రహ్మన్నగారి శ్రీనివాస్, డి.మహిపాల్‌రెడ్డి, ఏఈ రామకృష్ణారావు, వెంకట ప్రసాద్, నూగూరి నరేందర్, ఎస్సై ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

స్వామివారిని దర్శించుకున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

నాగారం కోదండరామస్వామి, వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ అనుబంధ ఆలయమైన మామిడిపల్లి శ్రీసీతారాములస్వామిని బుధవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దర్శించుకున్నారు. అర్చకులు కృష్ణహరి, ఆలయ ఈవో వినోద్‌రెడ్డి స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కేతిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయలు ఎల్లయ్య, మండల అధ్యక్షుడు ఫిరోజ్‌పాషా, నాగారం ఆలయ చైర్మన్ శ్రీకుమార్ ఉన్నారు.

● ఇల్లంతకుంట : మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామంలోని శ్రీరామలింగేశ్వర స్వామి ఉత్సవం భక్తిప్రపత్తుల మధ్య బుధవారం జరిగింది. ఉదయం ప్రత్యేక పూజలు, అన్నపూజ కార్యక్రమం సాయంత్రం ఆలయం చుట్టు బండ్ల ప్రదక్షిణ జరిగింది. ఉత్సవంలో పలు గ్రామాల భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.



అక్కపల్లిలో జాతరకు తరలి వచ్చిన భక్తులు

● వీర్నపల్లి : మండలంలోని పలు దేవాలయాల్లో భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. రంగంపేట బుగ్గ రామేశ్వరస్వామి ఆలయం మాఘ అమావాస్య జాతరకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి పూజలుచేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ కాశీరాం తెలిపారు. ఎస్ఐ ఎల్లాగౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

● గంభీరావుపేట : మండలంలోని మల్లారెడ్డిపేటలో బుధవారం శ్రీఆంజనేయస్వామి జాతరకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు. అంజన్న ఆలయ సమీపాన ఉన్న గుండలో స్నానమాచరించి, దర్శించుకుంటే అనారోగ్య సమస్యలు దరిచేరవని ప్రగాఢ నమ్మకం. ఈ సంవత్సరం కూడ పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి అంజన్నను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం, పలువురు నాయకులు శ్రీస్వామివారిని దర్శించుకున్నారు.



శ్రీస్వామివారిని దర్శించుకున్న నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం



దుబ్బరాజేశ్వరస్వామి రథానికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



తిమ్మాపూర్ శివారులో జాతరకు తరలివచ్చిన భక్తులు



పెద్దలింగాపూర్‌లో జాతరకు హాజరైన భక్తులు

గద్దర్‌పై కేంద్ర మంత్రి వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

గంభీరావుపేట జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రజా గాయకుడు, గద్దర్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆలిండియా ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. గంభీరావుపేటలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ గద్దర్ ప్రజానీకానికి చేసిన సేవలు వెలకట్టలేనివని ఆయన ఏ ఒక్కరి పక్షంలో లేకుండా అన్ని కులాలకు సంబంధించి అన్ని వర్గాలకు సంబంధించి ఆయన ఒక ప్రజా గాయకుడిగా పేరొందిన వ్యక్తి అని అన్నారు. గద్దర్ అనే పేరు మీదనే అవార్డులను ప్రదానం చేస్తున్న విషయం అందరికీ తెలిసిందేనని, అలాంటి ఆయనకు పద్మశ్రీ అవార్డు ప్రభుత్వం కచ్చితంగా ఇవ్వాల్సిందేనన్నారు. గద్దర్‌పై బండి సంజయ్ చేసిన కామెంట్స్ కరెక్ట్ కాదన్నారు. బండి సంజయ్ గద్దర్‌పై మరో సారి అనుచిత వ్యాఖ్యలు చేస్తే క్షమించేది లేదని, మరొకసారి ఇది పునరావృతం కావద్దని అన్నారు.

సభకు తరలిరావాలి

ఇల్లంతకుంట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీవర్గీకరణ లక్ష్యంగా హైదరాబాద్‌లో ఫిబ్రవరి 7న నిర్వహించే భారీ సభకు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మంద రాజు పేర్కొన్నారు. మండలంలోని వంతడుపులలో బుధవారం సమావేశం జరిగింది. ఈసందర్భంగా నూతన గ్రామకమిటీని ఎన్నుకున్నారు. మండల ఉపాధ్యక్షుడు కాసుపాక సురేష్, కాసుపాక శంకర్, రాములు, సావనపెల్లి ప్రవీణ్, లింగని ఓంకార్, సావనపెల్లి ఉమేష్, ఎదిరె విష్ణు, ఉదయ్, శ్రీను, హరీష్, పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

రేపు పౌరహక్కుల దినం

ఎల్లారెడ్డిపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాకురుపల్లితండాలో ఈనెల 31న పౌర హక్కుల దినం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రామచంద్రం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, అంటరానితనం, అత్యాచారాలు-నిషేధం తదితర అంశాలపై చర్చించి ప్రజలకు అవగాహన కల్పించనున్నామని పేర్కొన్నారు. మండల స్థాయి అధికారులు, ప్రజలు హాజరుకావాలని కోరారు.

గీత కార్మికుడికి గాయాలు

కోనరావుపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బావుసాయిపేట గ్రామానికి చెందిన మామిండ్ల ఎల్లయ్యగౌడ్ తాటిచెట్టుపై నుంచి పడగా గాయాలయ్యాయి. గాయపడిన ఎల్లయ్యగౌడ్‌ను తోటి గీత కార్మికులు చికిత్స నిమిత్తం వేములవాడకు తరలించారు.

నర్సరీల్లో ఎండిపోతున్న మొక్కలు

ఎల్లారెడ్డిపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో పచ్చదనం నింపేందుకు ప్రభుత్వం ఈజీఎస్ నిధులతో నర్సరీలను ఏర్పాటు చేసింది. మొక్కలను పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. అధికారుల పర్యవేక్షణ లేక ఎండకాలం రాక ముందే మొక్కలు మాడిపోతున్నాయి. మండలంలోని అక్కపల్లి శివారు నర్సరీలో మొక్కల పెంపకం చేపడుతున్నారు. మొక్కలను సరైన విధంగా నీటిని అందించకపోవడంతో ఎండిపోతున్నాయి. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



అక్కపల్లిలోని నర్సరీలో ఎండిపోతున్న మొక్కలు

ఎండుతున్న పంట పొలాలు.. ఆందోళనలో రైతులు

ఎల్లారెడ్డిపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ బావుల్లో పుష్కలంగా నీరు ఉండడంతో వరి పంట సాగు చేసిన అన్నదాతలకు ఆదిలోనే కరెంటు కష్టాలు మొదలయ్యాయి. విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి నాలుగు రోజులు గడుస్తున్నా 'సెస్' అధికారులు పట్టించుకోకవడంతో పంటపొలాలు పగుళ్ల బారుతున్నాయి. ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట గ్రామశివారులోని కొచ్చెరువు ప్రాంతంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నాలుగు రోజుల కిందట కాలిపోయింది. దాదాపు 10మంది రైతులు సాగు చేసిన 30 ఎకరాల విస్తీర్ణంలో కరెంటు సరఫరా లేక నీరందకుండాపోయింది. సుమారు 15ఎకరాల విస్తీర్ణంలోని వరిపొలాలు పగుళ్ల చూపాయి. సమస్యను సెస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. అప్పులు చేసి సాగు చేసిన పంటలు అధికారుల అలసత్వం వల్ల పగుళ్ల చూపి పనికి రాకుండాపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేసి కరెంటు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుని పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు. లేనిపక్షంలో సెస్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.



పగుళ్లు బారిన పంటపొలం

బార్‌ను సీజ్ చేసిన మున్సిపల్ కమిషనర్



బార్‌ను సీజ్ చేస్తున్న మున్సిపల్ అధికారులు

సిరిసిల్ల టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణం విద్యానగర్‌లోని చిత్ర బార్‌ను బుధవారం మున్సిపల్ కమిషనర్ లావణ్య సీజ్ చేశారు. దీంతో సంఘటన స్థలానికి చేరుకున్న బార్ యజమానులు ఏ కారణంతో సీజ్ చేశారని నోటీసులు లేకుండా ఎలా సీజ్ చేస్తారంటూ కమిషనర్‌తో వాగ్వాదానికి దిగారు. ట్రేడ్ లైసెన్స్ రూ.42వేలు చెల్లించనందున్న సీజ్ చేసినట్లు కమిషనర్ లావణ్య తెలిపారు. ఈనెల 25తో గడువు తీరిందని, ఇప్పుడే ట్రేడ్ లైసెన్స్ చెల్లిస్తామని వెంటనే బార్ తెరిపించాలని కమిషనర్‌ను బార్ యజమానులు కోరారు. ట్రేడ్ లైసెన్స్ మున్సిపల్ కార్యాలయంలో చెల్లించాలని కలెక్టర్ ఆదేశాలు వచ్చేంతవరకు తాము ఏమి చేయలేమంటూ కమిషనర్, మున్సిపల్ సిబ్బంది సంఘటన స్థలం నుంచి వెళ్లిపోయారు. బీఆర్ఎస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి తనయుడు మహేందర్ చిత్రబార్‌ను నడుపుతున్నాడు. చిత్రబార్‌కు వద్దకు చేరుకున్న బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని ఉద్దేశంపూర్వకంగా చిత్రబార్‌ను సీజ్ చేయించారంటూ ఆరోపించారు.

ప్రజా గాయకుడు గద్దర్‌పై రాజకీయ దాడి



మాట్లాడుతున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : ప్రజా గాయకుడు గద్దర్‌పై దేశ వ్యాప్తంగా ఒక రాజకీయ దాడి జరుగుతోందని గద్దర్ 77వ జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గద్దర్‌కు పద్మశ్రీ ఇవ్వడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యతిరేకిస్తుందనే వార్త దేశ వ్యాప్తంగా చెక్కర్లు కొడుతోందన్నారు. బీజేపీ భావజాలం గద్దర్ భావాజాలనికి పూర్తిగా బిన్నంగా ఉంటుందని రెండింటి మధ్ద వైవిధ్యం ఉందన్నారు. గద్దర్ బ్రతికుంటే బీజేపీ ఇచ్చే పద్మశ్రీ అవార్డును తిరస్కరించే వాడన్నారు. దేశంలో 50 కోట్ల మంది గుర్తుంచుకున్న గద్దర్‌కు బీజేపీ ప్రభుత్వం చెడ్డపేరు తీసుకురావాలని చూస్తుందని, దీన్ని తాము ఖండిస్తున్నామన్నారు. గద్దర్ జీవితం అంతా ప్రజల కోసం, భూమి కోసం భుక్తి కోసం విముక్తి కోసం పని చేశాడన్నారు. గద్దర్ 77వ జయంతిని విజయవంతం చేయాలన్నారు. పార్టీలకు అతీతంగా రాజకీయాలకు అతీతంగా ఈనెల 31న సిరిసిల్ల పట్టణం రుచి హోటల్ హాల్‌లో మధ్యాహ్నం గద్దర్ జయంతి వేడుకలను ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో జయంతి ఉత్సవ కమిటీ సభ అధ్యక్షుడు, మాల మహానాడు జాతీయ కార్యదర్శి రాగుల రాములు, సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, మాజీ ఎంపీటీసీ వంకాయల భూమన్న, మాల మహానాడు జిల్లా మాజీ అధ్యక్షుడు జక్కుల రామచంద్రం, లక్కం శేఖర్, సిలువేరు శ్రీనివాస్, బాలు పాల్గొన్నారు.

వేములవాడలో గ్రానైట్ టిప్పర్ బీభత్సం..

వేములవాడ టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో టిప్పర్ డ్రైవర్ బీభత్సం సృష్టించిన సంఘటన వేములవాడ పట్టణంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని మొదటి బైపాస్ నుంచి గ్రానైట్ టిప్పర్ విద్యుత్ స్తంభాన్ని వేగంగా ఢీకొట్టాడు. దీంతో టిప్పర్‌కు విద్యుత్ స్తంభం తగులుకుని తిప్పాపూర్ ఏరియా ఆసుపత్రి సమీపంలోని ఓ ఇంటి షెడ్డుకు ఢీకొని నిలిచిపోయింది. మహాలక్ష్మీవీధిలో విద్యుత్ స్తంభంకు ఢీకొట్టడంతో కాలనీ అందకారంగా మారింది. తిప్పాపూర్‌లోని రోడ్డు పక్కన ఇంటిముందు ఉన్న వాహనాలు, షెడ్లలోని సామానులు పూర్తిగా ధ్వంసమైనట్లు తెలిపారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

సీఎం, మంత్రుల చిత్రపటానికి క్షీరాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కోనరావుపేట, జనవరి 29(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పల్లిమక్త గ్రామంలో పలు అభివృద్ధి పనులకు కోటి 50లక్షలు మంజూరుపై హర్షం వ్యక్తంచేస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు బుధవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల అభ్యున్నతి కోసం పనిచేస్తుందన్నారు. మండలంలో బ్రిడ్జిలు, రోడ్ల మరమ్మతుల కోసం నిధులు మంజూరయ్యాయన్నారు. గత ప్రభుత్వ పాలనలో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూసిన బ్రిడ్జిల నిర్మాణానికి, రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు కాలేదన్నారు. ఆది శ్రీనివాస్ ప్రోత్సాహంతో మండలం అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి, మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాయిని ప్రభాకర్‌రెడ్డి, అప్పాల నాగభూషణం, కాంగ్రెస్ నాయకులు సుద్దాల మాజీ సర్పంచ్ కచ్చకాయల బాల్‌రెడ్డి, భాస్కర్‌రావు, సిద్ధరవేని ప్రభాకర్, ఉప్పుల గంగయ్య, బుర్ర రమేష్, రాజిరెడ్డి, ఆదిరెడ్డి, మల్లేశం, జాగిరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగ చిత్రపటానికి..

కోనరావుపేట మండలం ధర్మారం గ్రామంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగకు పద్మభూషణ్ అవార్డు రావడానికి సంతోషం వ్యక్తం చేస్తూ బుధవారం ఎమ్మార్పీఎస్ నాయకులు ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం..



విజేతలకు మెమొంటో ప్రదానం చేస్తున్న శరత్‌రావు తదితరులు

ముస్తాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ముస్తాబాద్ మండల మాజీ ఎంపీపీ జనగామ శరత్‌రావు పేర్కొన్నారు. మండలంలోని కొండాపూర్‌లో అయిల్నేని వెంకట్‌రెడ్డి, పరశరాములు ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు నగదు అందించి మొమొంటో, మెడల్స్ ప్రదానం చేశారు. ఈసందర్భంగా శరత్‌రావు మాట్లాడుతూ యువత ఫోన్‌లలో ఎక్కువగా లీనమవకుండా క్రీడా పోటీల్లో పాల్గొనాలని తద్వారా దేహధారుడ్యం, మానసికోల్లాసం కలుగుతుందన్నారు. చిన్న వయసుల్లోనే క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన వారు ఎందరో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యారటి లక్ష్మీ, మామిండ్ల లక్ష్మణ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సురేందర్‌రావు, యారటి కరుణాకర్, మార్వాడి గంగారాజు, బొందుగుల దేవిరెడ్డి నాయకులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

చివరి దశకు వంతెనల నిర్మాణం..

- పూర్తి కావస్తున్న హన్మాజిపేట బ్రిడ్జి పనులు
- తీరనున్న ప్రజల కష్టాలు

వేములవాడ రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో హన్మాజిపేటలోని నక్కవాగుపై, మర్రిపల్లి గ్రామశివారులో కల్వర్టు తక్కువ ఎత్తులో ఉండడంతో దశాబ్దాల కాలంగా వర్షాకాలంలో నీరు బ్రిడ్జిపైకి రావడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ప్రజల నుంచి డిమాండ్ పెరగడంతో గత ప్రభుత్వం హన్మాజిపేటలో 11.55కోట్లు, మర్రిపల్లి శివారులో 2కోట్ల నిధులతో హైలెవల్ బ్రిడ్జిల నిర్మాణానికి అనుమతులను మంజూరుచేసింది. నిధులు మంజూరైనప్పటికీ పనులు మందకోడిగా జరిగాయి. హన్మాజిపేట హైలెవల్ వంతెన నిర్మాణం జరుగుతున్న క్రమంలో తాత్కాలిక రోడ్డును ఏర్పాటు చేశారు. అయినప్పటికి వర్షాకాలం నక్కవాగు ఉధృతి పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో స్థానిక ఎమ్మెల్యే విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝాతో బ్రిడ్జి నిర్మాణాన్ని పరిశీలించి పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. దీంతో బ్రిడ్జి నిర్మాణ పనుల్లో వేగం పెరిగింది.



నిర్మాణంలో ఉన్న హన్మాజిపేట హైలెవల్ వంతెన

దశాబ్దాలుగా ఇబ్బందులు

ప్రతీ వర్షాకాలంలో వర్షాలు కురిసినప్పుడు నీటి ప్రవహం పెరిగి ఈ రోడ్డు నుంచి వెళ్లే ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడేది. బ్రిడ్జి నిర్మాణం పూర్తైతే హన్మాజిపేట నక్కవాగుపై బ్రిడ్జి నిర్మాణం పూర్తైతే వేములవాడ, బొల్లారం. లింగంపల్లి, కోనరావుపేట, సిరికొండ, నిజామాబాద్‌తో పాటు పలుగ్రామాల ప్రజల కష్టాలు తీరనున్నాయి.

తుదిదశకు మర్రిపల్లి బ్రిడ్జి నిర్మాణ పనులు

మర్రిపల్లి శివారులో హైలెవల్ వంతెన నిర్మాణ పనులు తుది దశకుచేరుకున్నాయి. బ్రిడ్జి పనులు పూర్తయినప్పటికీ లింకురోడ్డుపై తారుపోయకపోవడంతో దుమ్ము లేస్తుండడం వల్ల ప్రయాణికులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ప్రముఖ పుణ్యక్షేత్రం వేములవాడకు చేరుకునే వేములవాడ-కోరుట్ల ప్రధాన రహదారి కావడంతో నిత్యం రద్దీగా ఉంటోంది. రోడ్డుపై దుమ్ములేవకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బ్రిడ్జి నిర్మాణంలో వేగం..

చిలుక ప్రభాకర్, గ్రామస్థుడు



హన్మాజిపేట నక్కవాగుపై చేపట్టిన హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. దశాబ్దాలుగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యకు బ్రిడ్జి నిర్మాణంతో పరిష్కారం దొరకనుంది. బ్రిడ్జి నిర్మాణం పూర్తైతే వేములవాడ, బొల్లారం. లింగంపల్లి, కోనరావుపేట, సిరికొండ, నిజామాబాద్‌తో పాటు పలు గ్రామాల ప్రజల కష్టాలు తీరనున్నాయి.